# గ్రామీణ మట్టి రోడ్లకు మహర్దశ

కులకచర్ల, అక్టోబర్ 13 : కులకచర్ల మండల కేంద్రం నుంచి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న బొంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీకి బీటీ రోడ్డు మంజూరు కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చాలా కాలంగా మట్టి రోడ్లు ఉన్న గ్రామాలు తమ గ్రామాలకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డికి పలుమార్లు విన్నవించారు. కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో ఉన్న మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీంతో బీటీ రోడ్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీకావడంతో ఆయా గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయి. కొన్ని పనులు కూడా పూర్తి అయ్యాయి. కులకచర్ల మండల పరిధిలోని బొంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీకి 1.80కిలో మీటర్లకు గాను రూ. 1.20లక్షలు మంజూరయ్యాయి. దీంతో ఎన్నికల కోడ్‌కు ముందుగానే పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి బొంరెడ్డిపల్లి గ్రామానికి మంజూరైన బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. బొంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీకి రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతుండేవారు. వర్షాకాలం వచ్చిందంటే గ్రామస్తులు మోటారు సైకిల్‌పై వెళ్లేవారు కిందపడి పలువురికి గాయాలు అయిన ఘటనలు కూడా ఉన్నాయి. గ్రామానికి వెళ్లాలంటే వర్షాకాలంలో ఇబ్బంది కరంగా ఉంటుంది. మట్టి రోడ్డుతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామస్తులు ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి తెలియజేయడంతో బీటీ రోడ్డును మంజూరు చేయించి గ్రామస్తుల కలను నెరవేర్చేందుకు కృషిచేశారు. దీంతో రాక పోకలకు సులువు అవుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.





బొంరెడ్డిపల్లిలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)

### ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం..



మా గ్రామ పంచాయతీకి బీటీ రోడ్డు మంజూరు చేయించిన ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి గ్రామస్తులందరం రుణపడి ఉంటాం. గ్రామానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారం. బీటీ రోడ్డు వేస్తే రాకపోకలకు ఇబ్బందులు తలెత్తవు. రవాణ సౌకర్యం సులువు అవు తుంది. గతంలో ఎవ్వరూ కూడా ఈ రోడ్డును పట్టించుకోలేదు. అత్యవసర సమయంలో ఇబ్బందులు తలెత్తుతుంటాయి. ఎమ్మెల్యే కృషి వల్ల గ్రామ రూపురేఖలు మారుతున్నా యి.

– చాకలి అంజిలయ్య, సర్పంచ్ బొంరెడ్డిపల్లి

### ఆనందందాయకం...



కులకచర్ల మండలంలోని బొంరెడ్డిపల్లి గ్రామంతో పాటు చౌడాపూర్ మండలంలో ఆరు గ్రామాలకు రోడ్లు మంజూరు కావడం ఆనందంగా ఉంది. పలుమార్లు సమావేశాల్లో రోడ్ల గురించి గ్రామస్తులు తెలియజేసేవారు. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మట్టి రోడ్లుగా ఉన్న వాటిని బీటీ రోడ్లు మార్చేందుకు నిధులు మంజూరు చేయించారు. దీనితో పాటు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. దీనికి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాం.

– రాందాస్ నాయక్, జడ్పటీసీ కులకచర్ల

## రూ.2 లక్షల 38 వేల నగదు సీజ్



తాండూరు రూరల్, అక్టోబర్ 13: తాండూరు మండలం, కొత్లాపూర్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం వాహనాల తనిఖీల్లో భాగంగా రూ.2, 38, 000 లను పోలీసులు సీజ్ చేశారు. తాండూరు మండలం, మిట్టబాసుపల్లి గ్రామానికి చెందిన రాథోడ్ శంకర్‌నాయక్, కర్ణాటకలోని చందాపూర్ నుంచి బైక్ పై నగదును తీసుకువస్తుండగా, పోలీసులు కొత్లాపూర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేశారు. బైక్‌లో నగదు పట్టుబడినట్లు ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపారు. నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.

## అదృశ్యమైన విద్యార్థి ఇంటికి..



దోమ,అక్టోబర్ 13: మూడు రోజుల క్రితం అదృశ్యమైన విద్యార్థి ఇంటికి తిరిగొచ్చాడు. మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన దొడ్ల రాఘవేందర్ అనే విద్యార్థి దోమ ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ ఉన్నత పాఠశాలలో చదువుతూ అదృశ్యమయ్యాడు. శుక్రవారం ఉదయం తిరిగి తనంతకు తాను ఇంటికి చేరుకున్నాడు. కాగా కుటుంబ సభ్యులు కుమారున్ని దోమ పోలీసు స్టేషన్‌లో పోలీసుల వద్ద హాజరుపరిచి ఇంటికి తీసుకెళ్లారు.

## అన్నను చంపింది సొంత తమ్ముడే

పరిగి టౌన్, అక్టోబర్ 13 : దారుణ హత్యకు గురైన గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. మృతుడ్ని చంపింది సొం త తమ్ముడేనని శుక్రవారం సీఐ కార్యాలయంలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి...ఈ నెల 10వ తేదీన లఖ్నాపూర్ ప్రాజెక్టు దగ్గర ఓ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం రావడంతో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. కొద్ది దూరంలో రక్తంతో తడిసిన సుత్తె కనిపించింది. మృతదే హాన్ని వెంటనే పరిగి సర్కారు దవాఖాన మార్చురీలో భద్రపర్చి గుర్తు తెలియని వ్యక్తి ఆనవాళ్ల కోసం అన్వేషిస్తుండగా బొంరాస్‌పేట్ మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన జోగు చిన్న నర్సింహులు అలియాస్ సాయన్నగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి భూమి అమ్మాలని తన మరిది జోగు రాములు కొద్దికాలంగా తన భర్తతో గొడవపడుతున్నాడని చెప్పడంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తన అన్నను చంపితే తనకు భూమి వస్తుందని అన్నకు ఫోన్ చేసి లాల్ పహాడ్‌కు రమ్మని సూచించడంతో లాల్‌పహాడ్ వెళ్లిన జోగు చిన్న నర్సింహులును బైక్‌పై ఎక్కించుకొని నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకెళ్లాలని పథకం వేసి లఖ్నాపూర్ ప్రాజెక్టు దగ్గరకు తీసుకెళ్లి వెంట తెచ్చుకున్న సుత్తెతో తలపై బలంగా మోది హత్యచేశాడు. మృతుడి ఫోన్ స్విచ్చాఫ్ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. జోగు రాములును అదుపులోకి తీసుకోని విచారించగా నేరం ఒప్పుకున్నాడని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో సీఐ వెంకట్రామయ్య, ఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి

## అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలి

పరిగి టౌన్, అక్టోబర్ 13 : పరిగి బస్టాండు సమీపంలోని టీఎన్‌జీవోకు చెందిన స్థలంలో కొంత మంది అధికారుల అండదండలతో నిర్మాణ పనులు చేపడుతున్నారని నిర్మాణ పనులను నిలిపివేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడు తామని టీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన పరిగిలో అక్రమంగా నిర్మిస్తున్న పనులను పరిశీలించిన తర్వాత విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత నెల 20న మున్సిపల్ కార్యా లయంలో ఫిర్యాదు చేశామని అయినప్పటికీ రాత్రికి రాత్రే దొంగచాటున పిల్లర్ గుంతలు తీసి ముందు భాగంలో గేటు నిర్మించారన్నారు. అక్రమంగా నిర్మించిన గేటును తొలగించి తిరిగి అదే స్థానంలో టీఎన్‌జీవోల ఆధ్వర్యంలో కొత్త గేటు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పరిగి తాలుకా అధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, కొడంగల్, తాండూరు, వికా రాబాద్ యూనిట్‌ల అధ్యక్ష, కార్యదర్శులు కొండల్, శ్రీధర్, రామకృష్ణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న టీఎన్‌జీవో సంఘం నాయకులు

## బీఆర్ఎస్‌తోనే యువత భవిష్యత్

- యూత్ సమావేశంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



పెద్దేముల్ : మంబాపూర్‌లో ఆత్మీయ పలకరింపులో భాగంగా పార్టీ కార్యకర్తలను, నాయకులను కలుసుకున్న ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

తాండూరు, అక్టోబర్ 13: బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువత భవిష్యత్ బాధ్యత తనదేనని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని యువతతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తలుచుకుంటే సాధించనిదంటూ ఏమి లేదన్నారు. 45 రోజులు తమ కోసం పనిచేస్తే ఐదు సంవత్సరాలు మీ కోసం పనిచేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు పెద్దపీట వేసిందన్నారు. బీఆర్ఎస్‌తోనే యువత భవిష్యత్ ఉందని అందుకు యువకులు సైనికుల్లా పనిచేసి అత్యధిక మెజార్టీతో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. రూ.100 కోట్లకు బీజేపీ నన్ను కొనాలని చూసినా అమ్ముడు పోలేదన్నారు. తాండూరులో పుట్టిన నేను... మరణించేవరకు తాండూరు ప్రజల సేవకుడిగానే ఉంటానని తెలిపారు. అందుకు నియోజకవర్గంలోని ప్రజల ఆశీర్వాదం తమపై ఉండాలని కోరారు. అందరి సహాయ సహకారంతో 50 వేలకు పైగా మెజార్టీతో గెలుపొంది తాండూరుకు రూ.వేల కోట్ల నిధులు తీసుకువచ్చి అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు.

### బీఆర్ఎస్ విజయం ఖాయం

పెద్దేముల్, అక్టోబర్13 : త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి బీఆర్ఎస్ విజయం ఖాయమని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో ఆత్మీయ పలుకరింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూరు నియోజక వర్గాన్ని కనీవినీ ఎరుగని రీతిలో కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీకి నాయకత్వమే లేదని, బీఆర్ఎస్ బలమైన శక్తిగా ఉందన్నారు. పార్టీ నాయకులు,కార్యకర్తలు విభేదాలు అన్ని పక్కన పెట్టి విజయం కోసం కష్టపడాలన్నారు. ఎమ్మెల్యే వెంట గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజురెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్, మంబాపూర్ ఎంపీటీసీ యాలాటి శ్రీనివాస్,నాయకులు మోహిద్, ప్రకాశం, బోయిని నారాయణ, దత్తు కుమార్,మన్సాన్‌పల్లి రవి, సర్పంచులు పాండు నాయక్,చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి తాండూరులోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న బండమీదిపల్లి గ్రామ యువనాయకుడు మహేశ్‌ను ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి శుక్రవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. వైద్యానికి అయ్యే ఖర్చు మొత్తం తాను భరిస్తానని భరోసాను ఇచ్చారు. ఆయన వెంట రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు పంజుగుల శ్రీశైల్ రెడ్డి, కరణం పురుషోత్తం రావు తదితరులు ఉన్నారు.



దోమ,అక్టోబర్ 13 : మండల పరిధిలోని బొంపల్లి గ్రామానికి చెందిన దూదేకుల జహంగీర్‌సాబ్ గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీటీసీ రాములు,ఉప సర్పంచ్ రఫీక్ పాషా, షఫీ, పవన్ యాదవ్, షేర్‌ఖాన్, శ్రీనివాస్, వెంకటేశ్ ,నర్సింహులు,అనంతయ్య ఉన్నారు.

### సీనియర్ అసిస్టెంట్‌గా వేణుకుమార్ బాధ్యతలు

పెద్దేముల్, అక్టోబర్ 13 : మండల తహసీల్దార్ కార్యాలయ నూతన సీనియర్ అసిస్టెంట్‌గా వేణుకుమార్ విధుల్లో చేరారు. తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో ఐదు సంవత్సరాలుగా జూనియర్ అసిస్టెంట్ హోదాలో విధులు నిర్వహించిన వేణు కుమార్ ప్రమోషన్‌లో భాగంగా పెద్దేముల్ మండల తహసీల్దార్ కార్యాలయానికి సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది వేణుకుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో డీటీ మహేశ్‌కుమార్,ఆర్ఐ రాజురెడ్డి,రికార్డు అసిస్టెంట్ మహేశ్, కంప్యూటర్ ఆపరేటర్ బసంత్‌రెడ్డి పాల్గొన్నారు.